# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ జనవరి 31 శుక్రవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 195




నాగోబా సన్నిధిలో ప్రత్యేక పూజలు నాగోబా జాతర ప్రారంభమైన మూడో రోజున మెస్రం వంశస్థులు ఆలయం వెనుకాల పెర్సాపేన్, బాన్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## హామీలను మరిచి మభ్యపెడుతున్న కాంగ్రెస్



నిర్మల్: రాష్ట్రంలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి ప్రజలను మభ్యపెడు తోందని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే ఆ పార్టీ పరిస్థితి ఏంటో బయటప డుతుందని భాజపా శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. నిర్మల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో పథకాల అమలును కాంగ్రెస్ సర్కారు వాయిదా వేసే పరిస్థితి కనిపిస్తోంది. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ పేరిట రైతుబంధు సాయం పంపిణీని వాయిదా వేయకుండా ఇచ్చిన హామీ మేరకు రైతుల ఖాతాల్లో జమచేయాలి. పాలనను కొనసాగించలేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పి అధికారం నుంచి తప్పుకోవాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. రేషన్‌కార్డుల జారీలోనూ ప్రజల అపోహలు తొలగించేలా స్పష్టమైన మార్గదర్శకాలు ప్రకటించాలి. భూమిలేని వారికి రూ.12 వేల సాయం అంటూ ప్రకటించిన ప్రభుత్వం ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు తక్కువ మొత్తంలో సాయం అందిస్తుండటం సరికాదు. భూమిలేని పట్టణ ప్రాంతాల్లోని రైతు కూలీలకు న్యాయం ఎలా చేస్తారో చెప్పాలి. నిర్మల్ పట్టణ ప్రణాళిక రద్దుపై మున్సిపల్‌లో తీర్మానం చేయించాం. దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం" అని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.



# నేడు ఉస్మానియా ఆసుపత్రికి సీఎం భూమిపూజ


హైదరాబాద్: ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్‌నిర్మించ తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నూతన ఆసుపత్రి నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఉదయం 11.55 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సీఎంతో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ముఖ్య అధికారులు హాజరు కానున్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక రాష్ట్రాల ప్రజలకు సేవలందించిన ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. ప్రస్తుతం ఆసుపత్రి అఫ్జల్‌గంజ్‌లో ఉండగా.. నూతన భవనాన్ని గోషామహల్ స్టేడియంలో నిర్మించనున్నారు. 2 వేల పడకల సామర్థ్యంతో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నారు. 26 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న భవనం కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా నిర్మించాలని నిర్ణయించారు. రాబోయే వందేళ్ల

**ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్‌నిర్మించ తలపెట్టిన ఉస్మానియా ఆసుపత్రి భవన శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.**

**అత్యాధునిక వైద్య సౌకర్యాలతో నిర్మాణం**

**ఉస్మానియా ఆసుపత్రి భవనం నమూనా**

అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దాలని ఇటీవల నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి.. అధికారులను ఆదేశించారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ప్రతి వైద్య విభాగానికి ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు, ప్రతి థియేటర్‌కు అనుబంధంగా పోస్ట్ ఆపరేటివ్, ఐసీయూ వార్డులు, కిందిభాగంలో ఒకేచోట అన్నిరకాల డయాగ్నొస్టిక్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణానికి సుమారు రూ.2500 కోట్ల నుంచి రూ.2700 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా. కొత్త భవనం ప్రారంభోత్సవం తర్వాత 20 శాతం వైద్యుల సంఖ్య పెరగనుంది. రోజూ 5 వేల మంది ఓపీ రోగులను చూసేలా.., 30 విభాగాలతో రోబోటిక్ సర్జరీలు చేపట్టే విధంగా సౌకర్యాలు ఏర్పాటుచేస్తారు.



హిమాచల్ సీఎంతో భట్టి విక్రమార్క భేటీ

# హిమాచల్‌తో విద్యుత్ ఒప్పందాలు

న్యూఢిల్లీ: రాష్ట్ర విద్యుత్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క సూచనలతో రాష్ట్ర అధికారుల ప్రయత్నాలు ఫలించాయి. హిమాచల్ ప్రభుత్వం బూట్ విధానంలో 22 హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై ప్రతిపాదనలు ఆహ్వానించగా.. తెలంగాణ విద్యుత్‌శాఖ అధికారుల బృందం ఆయా ప్రతిపాదనలపై అధ్యయనం చేసి.. 100 మెగావాట్లకు పైబడిన సామర్థ్యం గల ప్రాజెక్టులపై ఆసక్తిని వ్యక్తం చేసింది. హిమాచల్ సీఎం సుఖ్విందర్‌సింగ్ సఖుతో గురువారం దిల్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. ఈ భేటీలో ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 400 మెగావాట్ల సెలీ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు ప్రాంతాలను పరిశీలించారు. వాటికి సంబంధించిన ముసాయిదాను పంపించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హిమాచల్ ప్రదేశ్ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ ఒప్పందంపై తెలంగాణ ప్రభుత్వం తగిన పరిశీలన చేసి త్వరితగతిన ఎంవోయూపై సంతకం చేసే విధంగా చర్యలు చేపడుతుందని భట్టి విక్రమార్క తెలిపారు.



2లో..

## జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా

మేయర్ పోడియంపైకి ప్లకార్డులను విసిరేసిన కార్పొరేటర్లు

మేయర్‌ను అడ్డుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు

తోసేసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు



2లో..

## అభివృద్ధికి నిధులు అడిగితే అరెస్టు చేస్తారా : హరీశ్‌రావు

రాష్ట్రానికి గుండె కాయ లాంటి హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మీ వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా? అని రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.



2లో..

# అమెరికాలో ఘోర విమాన ప్రమాదం

ల్యాండ్ అయ్యే సమయంలో ఢీకొన్న హెలికాప్టర్

నదిలో కుప్పకూలిన విమానం, హెలికాప్టర్

ఎటిసి సమాచారం ఇచ్చి 30 సెకన్లలోనే ప్రమాదం

64మంది మృతదేహాలను వెలికి తీసిన సహాయక బృందాలు



2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరికి బెయిల్ మంజూరు

## తొక్కిసలాట ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం

కుంభమేళాలలో పలు మార్పులకు శ్రీకారం

మరింత పకడ్బందీగా భద్రతా చర్యలు

2లో..









జాతిపితకు రాష్ట్రపతి, ప్రధాని నివాళి రాజ్‌ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించిన నేతలు గాంధీకి గవర్నర్, సీఎం ఘన నివాళి

# నేటినుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. తరవాత సభలు వాయిదా పడతాయి. ఫిబ్రవరి1న నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశ పెడతారు. ఈ నేపథ్యంలోనే గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో కేంద్రమంత్రులు, పలు పార్టీల ఎంపీలు హాజరయ్యారు. ఈసందర్భంగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లుల జాబితాను కేంద్రం అఖిలపక్షానికి అందించింది. ఇందులో వక్ఫ్ సవరణ బిల్లు కూడా ఉంది. బడ్జెట్ సమావేశాల్లోనే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌కు తీసుకురానున్నట్లు కేంద్రం తెలిపింది. దీంతోపాటు మొత్తం 16 బిల్లులను సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించింది. ఆ జాబితాను అఖిలపక్షం ముందు ఉంచింది. వక్ఫ్ చట్ట సవరణపై గతంలో కేంద్రం జేపీసీని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. వక్ఫ్ చట్టంలో మార్పుల పరిశీలన కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ సంయుక్త కమిటీ ఇటీవల సవరణ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. విపక్ష ఎంపీలు సహా ఇతరులు మొత్తంగా 44 మార్పులు సూచించగా.. 14 సవరణలను కమిటీ ఆమోదించింది. దానికి సంబంధించిన తుది నివేదికను సిద్ధం చేసి.. తాజాగా లోక్‌సభ స్పీకర్‌కు అందించింది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని తీసుకురావడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం చెబుతోంది. అయితే, ఈ సవరణలపై విపక్షాలు అనుమతి తెలిపాయి. ముస్లింలకు రాజ్యాంగపరంగా ఉన్న హక్కులపై దాడికే ఈ బిల్లును తెచ్చారని, వక్ఫ్‌బోర్డుల పనితీరులో జోక్యం చేసుకోవడమే ప్రభుత్వం అసలు ఉద్దేశమని విపక్ష సభ్యులు ఆరోపించారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ నుంచి జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, అర్జున్ రామ్ మేఘ్వాల్ తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ నుంచి ఎంపీ జైరామ్ రమేశ్, గౌరవ్ గొగోయ్ సహా ప్రతిపక్ష ఇండియా కూటమిలోని పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు హాజరయ్యారు. సభ సజావుగా సాగడంతో పాటు ముఖ్యమైన అంశాలపై భేటీలో చర్చించారు. పార్లమెంట్ సమావేశాలు రెండు విడతల్లో జరుగనున్న విషయం తెలిసిందే. తొలి విడత సమావేశాలు 31 నుంచి మొదలై.. ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. ఇక రెండో విడత సమావేశాలు మార్చి 10న మొదలై.. ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. తొలిరోజు శుక్రవారం పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ప్రసంగం అయిన అరగంట తర్వాత.. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవుతాయి.



# ఏపీ అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ

ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తేదీ కంటే ముందు ఆక్రమిత స్థలాల్లో నివాసం ఉంటేనే క్రమబద్ధీకరణ దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించింది. మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్టు, ఇతర జలవనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఖాళీ స్థలాలు, వాటిలో తాత్కాలిక ఇళ్లు కట్టుకున్నా క్రమబద్ధీకరణకు అనర్హులని పేర్కొంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. 150 గజాల వరకూ ఉచితంగానే క్రమబద్ధీకరణ చేయనున్నట్లు వెల్లడించింది. 301 గజాల కంటే ఎక్కువ భూమి ఆక్రమణలో ఉంటే సాధారణ రిజిస్ట్రేషన్ విలువతోనే క్రమబద్ధీకరణ చేసేందుకు అవకాశం కల్పిస్తూ.. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలు (బీపీఎల్) ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని ఇళ్లు, గుడిసెలు వేసుకొని ఉంటే అందులో 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. పేదలు కాని వారు ఉన్నా 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు. దీనికోసం ఈ ఏడాది డి సెంబర్ 31 వరకు గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. వీటిపై గ్రామ వీఆర్‌వో, వార్డు అధికారులు విచారణ జరిపి ఆయా ప్రాంతాలను బట్టి తహసీల్దార్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లకు నివేదికలు ఇస్తారు. వాటిని సబ్ డివిజనల్ కమిటీలో చర్చించి ఆమోదిస్తారు. ఆ తర్వాత లబ్దిదారుల ఎంపికపై ఆదేశాలు ఇస్తారు. వాటి ఆధారంగా తహసీల్దార్ కన్వేయెన్స్ డీడ్ రూపంలో క్రమబద్ధీకరణ ఉత్తర్వులు ఇస్తారు. రెండేళ్ల తర్వాత లబ్దిదారులకు ఆ భూములపై శాశ్వత హక్కులు ఇస్తారు. ఇదిలాఉండగా, గతంలో జగన్ సర్కారు వద్ద దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నవారు,అసలు దరఖాస్తు చేసుకోనివారు కూడా ఇప్పుడు తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చునని రె వెన్యూశాఖ మార్గదర్శకాల్లో పేర్కొంది. ఇంటిస్థలాల క్రమబద్ధీకరణకు ఎంపికై న వారు ప్రభుత్వ నిర్దేశించిన ఫీజులను రెండు వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. సీఎఫ్ఎంఎస్‌లో ఫీజులు చెల్లింపు ఉంటుందని రెవెన్యూశాఖ తెలిపింది.

## మహాత్ముడికి గవర్నర్ జిష్ణుదేవ్, సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్:** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. గ్రామస్థాయి నుంచి రాజధాని వరకు బాపూకు నివాళి అర్పించారు. ఈ క్రమంలో హైదరాబాద్ బాపుఘాట్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,డీజీపీ జితేందర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, ఉన్నతాధికారులు నివాళులు అర్పించారు. బాపూఘాట్ చేరుకున్న వీరంతా బాపూ విగ్రహం వద్ద పూలు అర్పించి నివాళి అర్పించారు. సర్వమత ప్రార్థనలు సాగాయి. దేశం కోసం ప్రాణాలు అర్పించిన పలువురు ప్రముఖుల త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

## జాతిపితకు రాష్ట్రపతి, ప్రధాని నివాళి

**న్యూఢిల్లీ:** జాతిపిత, స్వాతంత్ర్య సమరయోధుడు మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతి యావత్తూ నివాళి అర్పించింది. ఈ సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ నివాళులర్పించారు. వారు బాపూజీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. పలువురు కేంద్ర మంత్రులు సైతం నేడు గాంధీజికి నివాళులర్పించారు. స్పీకర్ ఓం బిర్లా సైతం నివాళి అర్పించారు. దేశవ్యాప్తంగా జాతిపితకు నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు.

కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లి కార్జున ఖర్గేలు కూడా జాతిపితకు ఘనంగా నివాళి అర్పించారు. వీరంతా మహాత్ముడికి నివాళి అర్పించారు. పలు రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులు, మంత్రులు నివాళి అర్పించారు.

## అమెరికాలో ఘోర విమాన ప్రమాదం

వాషింగ్టన్: అమెరికాలోని వాషింగ్టన్ సమీపంలో ప్రయాణికుల విమానం, సైనిక హెలికాప్టర్ ఢీ కొన్న ఘటనలో విమానంలో ఉన్న మొత్తం 64 మంది ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని అక్కడి అగ్నిమాపక శాఖ చీఫ్ వెల్లడించారు. ఇప్పటి వరకు 28 మృతదేహాలను నదిలోంచి బయటకి తీసినట్లు తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, విమానంలో ఉన్న వారెవరూ ప్రాణాలతో బయటపడే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. గత 24 ఏళ్లలో అమెరికాలో ఇదే అతిపెద్ద ప్రమాదమన్నారు. విమానం తలకిందులుగా నది అడుగుభాగంలో కూరుకుపోయిందని, అక్కడికి దగ్గర్లోనే హెలికాప్టర్ శకలాలను కూడా గుర్తించామని సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్న జాన్ డొన్నెలీ తెలిపారు. 30 సెకన్లలోనే అంతా జరిగిపోయింది

కాన్సాస్‌లోని విషిటా నుంచి బయల్దేరిన పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ ప్రయాణికుల విమానం వాషింగ్టన్ సమీపంలోని రోనాల్డ్ రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు సిద్ధమవుతుండగా.. రక్షణ శాఖకు చెందిన సికోర్‌స్కీ హెచ్-60 బ్లాక్‌హాక్ హెలికాప్టర్‌ను ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఈ విమానాన్ని.. స్థానికంగా పీఎస్ఏ ఎయిర్‌లైన్స్ నిర్వహిస్తోంది. ఘటన సమయంలో విమానంలో 60 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. ఇక, హెలికాప్టర్‌లో ముగ్గురు సైనికులు ఉన్నారని, వీఐపీలు ఎవరూ లేరని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. వీరి గురించి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## అభివృద్ధికి నిధులు అడిగితే అరెస్టు చేస్తారా : హరీశ్‌రావు

**హైదరాబాద్:** జీహెచ్ఎంసీ బీఆర్ఎస్ కార్పొరేటర్ల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని అడిగితే అరెస్టులు చేస్తారా? అని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. రాష్ట్రానికి గుండె కాయ లాంటి హైదరాబాద్ నగరాన్ని నిర్లక్ష్యం చేస్తున్న మీ వైఖరిని నిలదీస్తే మార్షల్స్‌తో కార్పొరేటర్లను బడ్జెట్ కౌన్సిల్ నుంచి బయటికి పంపిస్తారా? అని రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ మీద ఎలాంటి చర్చ లేకుండానే అమోదిస్తున్నట్లు ప్రకటించడం అప్రజాస్వామికం. మీ నిరంకుశ వైఖరికి ఇది మరో నిదర్శనం. ప్రజల తరుపున ప్రశ్నించే ప్రజాప్రతినిధుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా

హైదరాబాద్:జీహెచ్ఎంసీ కౌన్సిల్ మీటింగ్ సమావేశం రసాభాసగా మారింది. మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం గురువారం ఉదయం ప్రారంభమైంది. అయితే సమావేశం మొదలైన వెంటనే గందరగోళ పరిస్థితి నెలకొంది. ముందుగా బడ్జెట్ ప్రవేశపెడుతామని మేయర్ చెప్పగా.. అందుకు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు ససేమిరా అన్నారు. ముందు ప్రజా సమస్యలపై మాట్లాడాలని రెండు పార్టీల సభ్యులు పట్టుబట్టారు. ప్లకార్డులు పట్టుకుని మేయర్ పోడియం వద్దకు వచ్చిన బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్ కార్పొరేటర్లు అడ్డుకున్నారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్.. బీఆర్ఎస్ సభ్యుల నుంచి ప్లకార్డులను లాక్కొని చించేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పార్టీల కార్పొరేటర్లు ఒకరినొకరు తోసేసుకున్నారు. సమావేశం మొదలైన ఐదు నిమిషాల్లోనే తీవ్ర గందరగోళం నెలకొనడంతో మార్షల్స్ కౌన్సిల్ మీటింగ్‌లోకి ప్రవేశించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఒకరినొకరు తోసుకోవడంతో పాటు దుర్భాషలాడుకున్నారు. మేయర్ పోడియంపై బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు విసిరారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలో అమలుకావడం లేదని, గ్రేటర్ హైదరా బాద్‌లో నిధులు ఎక్కడికక్కడ దుర్వినియోగం అవుతున్నాయని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరోపిసున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగట్లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్లకార్డులు పట్టుకుని కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చారు. మేయర్ వద్దకు దూసుకెళ్తున్న క్రమంలో కాంగ్రెస్ కార్పేరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్ వారిని అడ్డుకున్నారు. వెంటనే మార్షల్స్ అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ కార్పొరేటర్లను అరెస్ట్ చేశారు. మరోవైపు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు విరుచుకు పడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటే అని అందుకే సమావేశం ముందుకు జరగకుండా ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారని కమలం పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు.

# తొక్కిసలాట ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం

**ప్రయాగరాజ్:** ప్రపంచంలో అతిపెద్ద మత సంస్కృతి పండుగ అయిన మహా కుంభమేళా 2025 ఉత్సవం ఈసారి కీలక మార్పులతో జరుగుతోంది. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న ఈ మహా కుంభమేళాలో భక్తుల రద్దీ, రవాణా వ్యవస్థ పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో యూపి ప్రభుత్వం మరింత పక్కాగా ఏర్పాట్లు చేసింది. అందుకు అనుగుణంగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఇవి ఉత్సవం సక్రమంగా నిర్వహించేందుకు తోడ్పడనున్నాయి. ఈ మార్పులు భక్తులు సురక్షితంగా ఆయా ప్రాంతాలను చేరుకోవడానికి సహాయపడతాయి. ఈ మహా కుంభమేళాలో మున్ముందు మళ్లీ విషాదాలు జరక్కుండా ఇంలాంటి కీలక మార్పులు తీసుకున్నారు. ఈ సారి భక్తుల రద్దీని నియంత్రించడానికి, ముఖ్యంగా ప్రధాన ఘాట్ల దగ్గర ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకుంటోంది. ప్రతి గంటకు ఒక సెట్ కొంతమంది భక్తులను మాత్రమే అనుమతించడం ద్వారా రద్దీని కంట్రోల్ చేయాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యమైన ఘాట్ల వద్ద రద్దీని తగ్గించడం, భక్తులకు బాగా ప్రాధాన్యత ఇవ్వడం, వృద్ధులు, వికలాంగులు, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు ఈ చర్యలు తీసుకోబడినట్లు ప్రభుత్వం తెలిపింది. మహా కుంభమేళా ప్రాంతంలో పర్యటించే భక్తుల రవాణాను బాగా కంట్రోల్ చేయడం కోసం ఫిబ్రవరి 4 వరకు 'నో వెహికల్ జోన్' అమలు చేయాలని నిర్ణయించారు. అంటే భక్తులు ప్రదేశంలో అడుగు పెట్టే ముందు తమ వాహనాలను ఆయా ప్రాంతాలలో మాత్రమే పార్క్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వీలైనంత వరకు అందరికీ పబ్లిక్ ట్రాన్స్ పోర్ట్ అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. దీని ద్వారా ట్రాఫిక్ జామ్, రద్దీని తగ్గించేందుకు అవకాశం ఉంటుంది. ఈసారి మహా కుంభమేళాలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలకు అనుమతి ఇవ్వకూడదని నిర్ణయించారు. ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు ఆ ప్రాంతంలో ప్రవేశించకుండా ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఈ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో భక్తులు ఆన్‌లైన్‌లో ముందుగా తమ వాహనాన్ని నమోదు చేసుకుని మాత్రమే పర్యటనకు రావాల్సి ఉంటుంది. ఈ చర్యకు అనుగుణంగా, వాహనాల సంఖ్యను కూడా నియంత్రించేందుకు ఇది సహాయపడుతుంది. భక్తుల రవాణా సరళతను పెంచేందుకు, ప్రయాగ్ రాజ్ నగరంలో వన్ వే రూట్ వ్యవస్థ అమలు చేయాలని నిర్ణయించారు. ముఖ్యమైన ప్రాంతాలకు, ఘాట్ల దగ్గరకు వెళ్లే దారులను ఒకవైపుగా మార్చి, మరో వైపు నుంచి రాకపోకలను పూర్తిగా వేరే రూట్లతో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విధంగా భక్తుల రవాణా మరింత సురక్షితంగా, సమర్థవంతంగా ఉండాలని ప్రభుత్వం ఆశిస్తోంది. మహా కుంభమేళాలో ఇతర సంవత్సరాల్లో వీఐపీ పాస్‌లు ఇచ్చి, ముఖ్య అతిథులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుండగా, ఈసారి యూపీ ప్రభుత్వం ఒక సంచలనం నిర్ణయం తీసుకుంది. 'వీఐపీ పాస్‌లు' ఇకపై ఇవ్వడం లేదని ప్రకటించారు. ఈ విధానం ద్వారా వీఐపీలు, సర్వసాధారణ భక్తులకు సమానమైన అవకాశం కల్పించబడుతుంది. ఈ నిర్ణయం వల్ల ప్రజల మధ్య అసమానతలు తగ్గిపోతాయని ప్రభుత్వం భావిస్తుంది. అంతేకాక ఇందులో వీఐపీ పాస్‌ల ద్వారా ఏర్పడే అనవసరమైన రద్దీని కూడా తొలగించాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతీ సంవత్సరం కోట్లాది మంది భక్తులు కుంభమేళాలో పాల్గొంటూ తమ ఆధ్యాత్మిక మొక్కులను తీర్చుకుంటారు.



# ఏపీలో వాట్సాప్ సేవలను ప్రారంభించిన మంత్రి నారా లోకేశ్

**వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను సంప్రదించాలని సూచన**

**అమరావతి:**ఆంధ్రప్రదేశ్‌లో వాట్సప్ సేవలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఇక నుంచి ప్రభుత్వ ధృవ పత్రాలన్నీ వాట్సప్ ద్వారానే ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా వాట్సప్ సేవల కోసం నెంబర్‌ను విడుదల చేశారు మంత్రి లోకేష్. వాట్సప్ గవర్నెన్స్ కోసం నెంబర్ 9552300009ను అనౌన్స్ చేశారాయన. దేశంలోనే తొలిసారి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలు అందించనుంది ఏపీ సర్కార్. మొదటి విడతలో 161 సేవలను వాట్సప్ ద్వారా అందించనున్నారు. ఈ తొలి విడతలో దేవాదాయ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ, అన్నా క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖలలోని సేవలు అందిస్తారు. సర్టిఫికెట్ల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే విధానానికి స్వస్తి పలకాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. పౌరుల సమాచారం సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా ఫోరెన్సిక్, సైబర్ సెక్యూరిటీ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించేందుకు 2024 అక్టోబరు 22న మెటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు ఇప్పుడు వాట్సప్ గవర్నెన్స్ తీసుకువస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. వేగంగా పౌరసేవలు అందించటం, పారదర్శకత, జవాబుదారీతనంలో భాగంగా వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తీసుకువచ్చారు. సమాచార గోప్యత, వేగంగా సేవలందించేందుకు జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ పని చేస్తుంది. దేవాదాయ శాఖలోని ప్రముఖ దేవాలయాల్లో దర్శనాల టికెట్లు, గదుల బుకింగ్, డోనేషన్ల సేవల్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ శాఖలో దరఖాస్తుల స్టేట్స్ ల్యాండ్ రికార్డులు, ఇతర ముఖ్యమైన సర్టిఫికెట్లను జారీ చేయనున్నారు. మున్సిపల్ శాఖలో ఆస్తిపన్ను చెల్లింపులు, జనన మరణ ధృవీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు జారీకి నిర్ణయించారు. ఇతర శాఖల్లో యుటిలిటీ బిల్లులు, ఎలక్ట్రిసిటీ బిల్లులు తదితర సేవల్ని వాట్సప్ పేమెంట్ వ్యవస్థ ద్వారా చెల్లింపులు చేసేందుకు అవకాశం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలు పొందాలనుకునే వారి కోసం ప్రభుత్వం ఒక నెంబర్ అనౌన్స్ చేసింది. 9552300009 ద్వారా వాట్సప్‌లో ప్రభుత్వ సేవలను పొందవచ్చునని మంత్రి లోకేష్ తెలిపారు.

## అడవిలో 5 కిలోమీటర్లు నడిచిన కలెక్టర్

**భద్రాచలం:**అడవులను రక్షించుకోవాలి..నేచురల్ అందాలను ఆస్వాదిస్తూ..సహజమైన ప్రకృతి గాలిని పీల్చుకుంటూ ఆహ్లాదంగా గడపాలని జిల్లా కలెక్టరు అడవిలో తిరిగాడు. అటవీ ప్రాంతంలో సందర్శకులకు ఎలాంటి వసతులు ఉండాలి, అడవులను ఏవిధంగా సంరక్షించుకోవాలి, (ఎకో) ప్రాజెక్ట్‌తో అభివృద్ధి చేసి ఖమ్మం జిల్లా కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆహ్లాదకరమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు జిల్లా కలెక్టర్ అన్ని విధాలుగా సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పులిగుండాల ప్రాజెక్టు ను ఎకో టూరిజం ప్రాంతంగా ఫిబ్రవరి నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. పెనుబల్లి మండల పరిధిలోని కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్ పులిగుండల ప్రాజెక్ట్ ను ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పులి గుండాల ప్రాజెక్ట్ ను పరిశీలించారు. సుమారు 5 కిలోమీటర్లు అడవి మార్గం గుండా కాలినడకన గుట్టల పైకి ఎక్కి పులిగుండాలను కలెక్టర్ సందర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఎకో టూరిజం ప్రణాళికలో భాగంగా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఫారెస్ట్ కమాండర్ జీపులో ప్రయాణించి పచ్చని సోయగం తో ఆహ్లాదకరంగా ఉన్న అటవీ ని చూసి టూరిజం ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేసేందుకు ఆసక్తి చూపారు. అడవులను సంరక్షిస్తూ, ఆహ్లాదకరమైన పరిస్థితులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ కోసం మొత్తం ఏరియాని పరిశీలించారు. పాలపిట్ట ఓరియల్ టవర్ ఎక్కి బైనాక్యులర్ ద్వారా చుట్టుపక్కల ఏరియల్ వ్యూ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఎక్కువగా మనకు ప్రకృతి పరంగా అందమైన గుట్టలు, చెరువుల నుండి జాలువారే నీళ్లతో అడవిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేసుకోవాలని, దీనివల్ల ఆర్యోగమనే సంపద వస్తుందని అన్నారు. రానున్న తరాలకు ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీసుకొని వచ్చి ప్రకృతిని కాపాడుతూ, అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రకృతిని కాపాడుకోలేక మనకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, దానిని నివారించేందుకు అభివృద్ధి చేపట్టామన్నారు. పులిగుండల ప్రాజెక్టు లో ఆహ్లాదం పంచే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేసి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. పర్యాటకుల కోసం చెరువులో బోటింగ్, వసతి కాటెజ్ లు, భోజనం, త్రాగునీరు వసతులను కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబంతో సందర్శించి ఆనందంగా గడిపేలా చర్యలు చేపడతామని, చెరువులో సంచరించే పక్షులు, పులిగుండాల చరిత్ర చెప్పే విధంగా వినూత్న కార్యక్రమాల నిర్వహణకు గైడ్ లు కూడా అందుబాటులో ఉంటారని అన్నారు. పిల్లలకు సైక్లింగ్, ఓపెన్ జిమ్, అడ్వెంచర్ యాక్టివిటీస్ వంటివి అభివృద్ధి చేస్తూ త్వరలోనే సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ఇద్దరికి బెయిల్ మంజూరు

**హైదరాబాద్:**రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇద్దరికి బెయిల్ మంజూరు అయ్యింది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ భుజంగరావుకు తెలంగాణ హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయలతో కూడిన 2 షూరిటీలూ సమర్పించాలని న్యాయస్థానం షరతు విధించింది. అలాగే వ్యక్తిగతమైన పాస్ పోర్టులు సమర్పించాలని ఇద్దరికీ ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని భుజంగరావు, రాధాకిషన్ రావుకు తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో భుజంగరావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ఆధారంగా చేసుకుని చాలా కీలకమైన అంశాలు బయటపడ్డ విషయం తెలిసిందే. ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేయడంలో టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు పాత్ర ఉందని దర్యాప్తు అధికారులు నిర్ధారించారు. నాంపల్లి కోర్టు వీరి బెయిల్ పిటిషన్‌ను రెండు సార్లు తిరస్కరించింది. దీంతో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు ఇద్దరు. ఈ కేసులో పదినెలలకు పైగా జైలులో ఉన్నామని, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని ఇరువురు హైకోర్టును కోరారు. వారి ఆరోగ్య పరిస్థితిని పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం ఇద్దరికీ బెయిల్ మంజూరు చేసింది. అలాగే ఈకేసులో ఇంకా విచారణ సాగుతోందని, ఎక్కడా కూడా సాక్షులను ప్రభావితం చేయవద్దని, దర్యాప్తు అధికారులను కూడా ప్రభావితం చేసేలా ప్రయత్నిస్తే చర్యలు తప్పవని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. విదేశాలకు పారిపోయేందుకు అవకాశం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించడంతో వారి వ్యక్తిగతమైన పాస్ట్‌పోర్టులను సమర్పించాలని ఆదేశించింది. పోలీసులు ఎప్పుడు పిలిచినా వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని భుజంగరావు, రాధాకిషన్‌రావుకు ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే అనారోగ్య కారణాలతో రాధాకిషన్‌రావు ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. ప్రస్తుతం హైకోర్ట్ బెయిల్ మంజూరు చేయడంతో భుజంగరావు రేపు (శనివారం) ఉదయం బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం ఉంది.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# రాష్ట్రస్థాయి “రగ్బీ” క్రీడకి “ఆర్కిడ్స్” విద్యార్థులు.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, జనవరి 30:**

జిల్లా కేంద్రంలో గల ఆర్కిడ్స్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీలకు ఎంపిక అయ్యారు. విద్యార్థులు అవినాష్, అమర్ తేజ, దీప్తి, మధుప్రియ, బిందు శ్రీ లు ఎంపిక కాగా, వారిని గురువారం ఉన్నారు. పాఠశాల చైర్మన్ అండ్ ప్రిన్సిపాల్ గోవర్ధన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల పట్ల




విద్యార్థులకు అవగాహనను కల్పిస్తూ, వారిని ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలని, చదువు తో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తో పాటు ఆర్ కె గ్రూప్ సీఈఓ జైపాల్ రెడ్డి, డైరెక్టర్ సదాశివరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి, పిఈటీలు సంతోష్ కుమార్, సరిత, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య అమరవీరులకు ఘన నివాళులు.

## - ఐడీఓసీలో సంస్మరణ దినోత్సవం.





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జనవరి 30**

: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నేతృత్వంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే సంకల్పాన్ని చాటుతూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జనవరి 30**

బాపూజీ వచనలయ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డం భక్తవత్సలం జన్మదినన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని దుబ్బా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిన చేశారు. ఈ సందర్భంగా భక్తవత్సలం మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం తన జన్మదినం సందర్భంగా సేవ కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉంది అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నా మిత్రులు, శ్రేయభిలాషుల తో కలసి, పేద పిల్లల కు నోటు బుక్స్ పంపిణి చేశాము అన్నారు. హంగు అర్భటాలు కాకుండ పేద విద్యార్థుల కోసం సేవ కార్యక్రమలు చేయడం ఆత్మ సంతృప్తి ఇస్తుంది అన్నారు. తన రాజకీయ జీవితం లో పేదలకు సేవ చేయాలనేదే మొదటి ప్రాధాన్యత అన్నారు. భవిష్యత్తులో ఎటువంటి సహకారం అవసరం ఉన్న చేయడానికి సిద్ధంగా ఉన్నానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులతో కలసి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమం లో బాపూజీ వచనలయ సభ్యులు శంకర్ అప్ప, కోపూరి జగన్, దిలీప్ పవర్, తదితరులు పాల్గొన్నారు.



# మల్లారెడ్డి కాలేజీ బిల్డింగ్ పైనుంచి దూకేందుకు యువతి యత్నం..

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి చెందిన విద్యాసంస్థలు ఈ మధ్య తరచూ వార్తల్లో నిలుస్తున్నాయి. ఇటీవలే బాలికల హాస్టళ్లలోని బాత్రూంలలో సీక్రెట్‌గా కెమెరాలు పెట్టి వీడియోలు తీశారన్న ఆరోపణలు సంచలనం సృష్టించాయి. కాగా.. ఇప్పుడు ఓ విద్యార్థి ఆత్మహత్యకు యత్నించటం.. చివరి నిమిషంలో ఆమెను తోటి విద్యార్థులు, వాచ్‌మెన్ కలిసి కాపాడారు. ఈ విషయం తీవ్ర చర్చకు తెరలేపింది. ఆ అమ్మాయి ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నది చర్చనీయాంశంగా మారింది.

మాజీ మంత్రి మల్లారెడ్డి ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థిని ఆత్మహత్యాకు యత్నించటం కలకలం రేపింది. అయితే.. కాలేజీ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తు నుంచి దూకేందుకు ప్రయత్నించిన విద్యార్థిని చివరి నిమిషంలో తోటి విద్యార్థులు, వాచ్‌మెన్ కాపాడారు. అయితే.. బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న అమ్మాయి.. పరీక్ష ఫెయిల్ అవుతాననే భయంతో ఆత్మహత్యకు యత్నించిందని కొందరు చెప్తుంటే.. పరీక్షల్లో కాపీ కొడుతుండగా దొరికిపోయిందని.. దీంతో అవమానంగా భావించి ఆత్మహత్యకు యత్నించిందని మరికొందరు చెప్తున్నారు.

అయితే.. నాలుగో అంతస్తులోని కిటికీ నుంచి కిందికి దూకేందుకు ప్రయత్నించగా.. చివరి నిమిషంలో చూసిన తోటి విద్యార్థులు, వాచ్‌మెన్ సహాయంలో అతికష్టం మీద కాపాడారు. సకాలంలో స్పందించటంతో.. ఆ అమ్మాయిని ప్రాణాలతో కాపాడగలిగారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలను.. బిల్డింగ్ కింది నుంచి చూసిన విద్యార్థులు తమ ఫోన్లలో రికార్డు చేయగా.. అవి కాస్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. చివరి నిమిషంలో అద్భుతమే జరిగింది.. ఒక్క క్షణం లేటయినా పరిస్థితి వేరేలా ఉండేదని కామెంట్లు చేస్తున్నారు. అయితే.. ఆ విద్యార్థిని ఎందుకు ఆత్మహత్యకు యత్నించిందన్నది మాత్రం పూర్తి క్లారిటీ రావాల్సి ఉంది.

నిజంగానే పరీక్ష బాగా రాకపోవటంతో ఫెయిలవుతానన్న భయంతో ఆత్మహత్యకు యత్నించిందా.. లేక కాపీ కొడుతూ దొరికిపోతే.. అందరి ముందు ఇన్విజిలేటర్ ఆమెను అవమానించటం వల్ల మనస్థానికి గురై ఏమైనా దూకేందుకు ప్రయత్నించిందా అని.. పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదిలా ఉంటే.. మల్లారెడ్డి విద్యాసంస్థల్లో గత ఏడాది కాలంగా.. పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతేడాది డిసెంబర్‌లో దుండిగల్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న శ్రావణి అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది.



# ఫ్యామిలీలో అందరూ ప్రభుత్వ ఉద్యోగులే..!

ఆ కుటుంబంలో నాన్న ప్రభుత్వ ఉద్యోగి.. అమ్మ కూడా గవర్నమెంట్ ఎంప్లాయే. వాళ్ల పెద్దబ్బాయి కూడా ప్రభుత్వ ఉద్యోగే. ఇక మిగిలిన చిన్నబ్బాయి కూడా ఇటీవలే ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. దీంతో.. ఆ ఫ్యామిలీ ఫ్యామిలీ అంతా ప్రభుత్వ ఉద్యోగులే అయ్యారు. ఈ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫ్యామిలీ ఎక్కడో కాదు.. మన తెలంగాణలోని జనగామ జిల్లా రఘునాథపల్లిలోనే. జింగ్ జింగ్ అమేజింగ్ కదూ..!

ఈ కాలంలో ప్రభుత్వ ఉద్యోగం సాంధించటమంటే అశామాషీ వ్యవహారమేమీ కాదు. మొదట ప్రభుత్వాలు నోటిఫికేషన్లు వెయ్యాలి. సరే సరైన సమయంలో నోటిఫికేషన్లు వేశారే అనుకున్నా.. ఒక్కో పోస్టుకు వేలల్లో అభ్యర్థులు పోటీ పడుతున్న కాలమిది. అంతా కాంపిటీషన్‌లో జాబ్ కొట్టారంటే.. వాళ్లు కచ్చితంగా గ్రేటే. అయితే.. ఒక కుటుంబంలో ఒక్కరు గవర్నమెంట్ జాబ్ కొట్టారంటేనే గ్రేట్ అనుకుంటున్న క్రమంలో.. ఓ ఫ్యామిలీ ఫ్యామిలీ మొత్తం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించటం కచ్చితంగా ఆశ్చర్యం కలిగించే విషయమే. మరి ఆ ప్రభుత్వ ఉద్యోగుల ఫ్యామిలీ గురించి తెలుసుకోవాలంటే.. జనగామ జిల్లా రఘునాథపల్లికి వెళ్లాల్సిందే.

రఘునాథపల్లికి చెందిన కల్పగూరి నర్సయ్య రమాదేవి దంపతులు జనగామలో నివసిస్తున్నారు. ఈ దంపతులకు సాయిరుగ్వేద్, రాజనాగాశ్విత్ ఇద్దరు కుమారులున్నారు. కాగా.. నర్సయ్య, రమాదేవి దంపతులిద్దరూ.. ప్రభుత్వ

ఉద్యోగులే. ఆ కాలంలోనే కష్టపడి చదివి ప్రభుత్వ ఉద్యోగులు సాధించారు. నర్సయ్య ప్రస్తుతం ములుగు జిల్లాలో మిషన్ భగీరథలో ఏఈగా విధులు నిర్వహిస్తున్నారు. రమాదేవి రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్‌లో ఉపాధ్యాయురాలుగా ఉన్నారు. అయితే.. వీరిద్దరి కుమారులైన సాయిరుగ్వేద్,

రాజనాగాశ్విత్.. బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ చదివారు. ప్రభుత్వ శాఖల్లో ఇంజినీరింగ్ పోస్టులకు జరిగిన పరీక్షల కోసం గట్టిగానే ప్రిపేర్ అయ్యారు. ఈ క్రమంలోనే.. 2023 మేలో జరిగిన పరీక్షలు రాసిన పెద్ద కుమారుడు సాయిరుగ్వేద్ సెలెక్ట్ అయ్యాడు. 2024 అక్టోబరులో జనగామ ఆర్ అండ్ బీలో ఏఈఈగా విధుల్లో చేరారు. ఇక.. చిన్న కుమారుడైన రాజనాగాశ్విత్ కూడా.. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి 12వ ర్యాంకు సాధించాడు. ఓయూలో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ టాప్ ర్యాంకుతో 2023లోనే పూర్తి చేశాడు. ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీల భర్తీకి 2023 నవంబరులో జరిగిన పరీక్షలు రాసిన రాజనాగాశ్విత్.. భూగర్భ జల వనరుల శాఖలో ఏఈ పోస్టుకు ఎంపికయ్యాడు. త్వరలోనే ఉద్యోగంలో కూడా చేరనున్నాడు. ఇక చిన్న కుమారుడు కూడా ప్రభుత్వ ఉద్యోగం సాధించటంతో.. ఫ్యామిలీ ఫ్యామిలీ అందరూ గవర్నమెంట్ ఎంప్లాయిస్‌గా మారారు.

పెద్ద పెద్ద చదువులు చదవి కూడా సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం కుస్తీ పడుతున్న ఈ కాలంలో.. తమ కుమారులు మాత్రం అటు చదువులు పూర్తి చేయగానే ఇటు ఉద్యోగాలు సాధించటం అది కూడా వాళు చదివిన చదువుకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగాలే సాధించటం పట్ల నర్సయ్య, రమాదేవి దంపతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పైకి బిర్యానీ సెంటర్ నడుపుతూనే..

# గుట్టుగా పెద్ద యవ్వారమే నడిపిస్తున్నాడుగా..!



తెలంగాణలో మరోసారి ఉగ్రవాదుల కదలికలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇప్పటివరకు హైదరాబాద్, కరీంనగర్ లాంటి కొన్ని ప్రదేశాల్లోనే ఉగ్ర కదలికలు కనిపిస్తుండగా.. ప్రస్తుతం వరంగల్‌లో కూడా ఉగ్రవాదులకు సంబంధించిన కలదలికలున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతుండటమే కాదు.. పోలీసులు ఓ వ్యక్తిని అరెస్టు కూడా చేయటం సర్వత్రా ఆందోళనకరంగా మారింది.

తెలంగాణలో మరోసారి ఉగ్రవాదుల కదలికలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇన్ని రోజులు.. అయితే హైదరాబాద్‌లోనో.. లేదంటే కరీనంగర్ జిల్లాలోనో ఉగ్ర కదలికలు కనిపించేవి. కానీ.. ఇప్పుడు వరంగల్‌లో కూడా ఉగ్రవాదులకు సంబంధించిన కదలికలు వెలుగులోకి వచ్చాయి. నగరానికి చెందిన వ్యక్తికి పాకిస్థాన్ ఉగ్రవాదులతో లింకులు ఉన్నట్లు ఆరోపణలు రావటంతో.. కలకలం రేగింది. వరంగల్ జానిపీరీలకు చెందిన జక్రియా అనే వ్యక్తికి పాకిస్థాన్ టెర్రరిస్టులతో సంబంధాలు ఉన్నాయని నిఘా వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు అతన్ని చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జనవరి 25వ తేదీన శ్రీలంకకు వెళుతుండగా.. జక్రియాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వరంగల్ శివనగర్ అండర్ బ్రిడ్జ్ వద్ద నిందితుడు జక్రియా.. బిర్యానీ సెంటర్ నడుపుతున్నాడు. జక్రియాకు కొన్నేళ్లుగా పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ ఆరోపణల నేపథ్యంలో.. అప్రమత్తమైన పోలీసులు.. జక్రియా కదలికలపై నిఘా ఉంచారు. ఇందులో భాగంగానే.. జక్రియా శ్రీలంకకు వెళ్తున్న క్రమంలో.. పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిజంగానే జక్రియాకు పాకిస్థాన్ టెర్రరిస్టులతో సంబంధాలున్నాయా.. ఉంటే ఎప్పటి నుంచి ఉన్నాయి.. ఎలాంటి సమాచారం అందించే వాడు.. జక్రియాతో పాటు ఇలా ఇంకెంత మంది ఉన్నారన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

అయితే.. జక్రియా అసలు స్వస్థలం పాకిస్థాన్. 32 సంవత్సరాల క్రితమే ఇండియాకు వచ్చిన జక్రియా ముందుగా.. ఏపీ ఉన్న గుంటూరులో స్థిరపడ్డారు. 25 సంవత్సరాల క్రితం వరంగల్‌కు వచ్చి జానిపీరీలో స్థిరపడ్డాడు. కాగా.. వరంగల్‌లోని శివనగర్ అండర్ బ్రిడ్జి దగ్గర.. రాయల్ బావర్చి బిర్యాని పాయింట్ నడిపిస్తున్నాడు. అయితే.. జనవరి 25న ఖలీఫా ఎన్నిక కోసం శ్రీలంకకు వెళ్తుండగా.. మద్రాస్ ఎయిర్ పోర్టులో అధికారులు అతన్ని అరెస్ట్ చేశారు. పస్తుతం పోలీసుల బృందం జక్రియాను విచారిస్తోంది.

నిజంగానే జక్రియాకు ఉగ్రవాదులతో సంబంధం ఉందా లేక కేవలం అనుమానమేనా అన్నది తెలియాలంటే వేచి చూడాల్సిందే. మరోవైపు... వరంగల్‌లో ఉగ్రవాదుల కదలికలు ఉన్నాయని పోలీసులు ఓ వ్యక్తిని అరెస్ట్ చేయడంతో స్థానికంగా ప్రజలు భయాందళోనలకు గురవుతన్నారు. పోలీసులు కూడా అప్రమత్తమై మరింత నిఘా పెంచారు.

# ప్రియుడితో ఏకాంతంగా కుమార్తె.. అలా చూసి ఆగ్రహంతో తండ్రి...

ఇంట్లో ఎవరూ లేరు. ఎవరి పనుల మీద వాళ్లు వెళ్లిపోయారు. తాను మాత్రమే ఒంటరిగా ఉంది. ఇలాంటి సమయం మళ్లీ దొరుకుతుందో లేదో అనుకుందేమో.. వెంటనే తన ప్రియున్ని ఇంటికి పిలిచింది. ఆ ప్రియుడు కూడా ఏమాత్రం ఆలోచించకుండా.. నిమిషాల్లోనే ప్రియురాలి ఒళ్లో వాలిపోయాడు. కానీ.. అప్పుడు అసలైన ట్విస్ట్. ఆఫీసు నుంచి ఆ అమ్మాయి తండ్రి ఇంటికి చేరుకున్నాడు. ప్రియుడితో తన కుమార్తె సన్నిహితంగా ఉండటం చూసి.. కోపంతో ఊగిపోయాడు. ఆ తర్వాత..! తెలిసీ తెలియని తనంతోనో, ఉరకలెత్తే ఉడుకు రక్తం వల్లో చేసే తొందరపాటు చర్యలు కొన్నిసార్లు ఊహించని పరిణామాలకు దారితీస్తుంటాయి. అచ్చంగా అలాంటి ఘటనే.. హన్మకొండలో చోటుచేసుకుంది.

హనుమకొండలోనిశివారు ప్రాంతానికి చెందిన బాలిక (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వరంగల్‌కు చెందిన ఓ బాలుడి (17)తో కొన్నాళ్లుగా ప్రేమలో ఉంది. అయితే.. మంగళవారం (జనవరి 28న) ఇంట్లో ఎవరూ లేరు. ఎవరి పనుల మీద వాళ్లు వెళ్లిపోయారు. ఇంట్లో తానొక్కతే ఒంటరిగా ఉంది. అసలే యుక్తవయసు.. అపై ప్రేమలో ఉంది. పైగా ఇంట్లో కూడా ఎవరూ లేరు. ఎప్పుడోగానీ ఇలాంటి ఏకాంత సమయం దొరకదనుకుందేమో వెంటనే తన ప్రియుడికి విషయం చెప్పి ఇంటికి రమ్మని పిలిచింది. ఇంకేముంది.. నిమిషాల్లోనే ఆ ప్రేమికు డు ప్రియురాలి ఒళ్లో వాలిపోయాడు. ఆ ఇద్దరు ప్రేమికులు ప్రేమలో మునిగితేలుతున్నారు.

అదే సమయంలో.. ఆఫీసు ముగించుకుని అమ్మాయి తండ్రి ఇంటికి వచ్చాడు. ఏకాంతంలో పడి ఘడియ వేసుకోవటంతో పాటు సమయాన్ని కూడా మర్చిపోయినట్టున్నారు ఆ ప్రేమికులు. ఆ బాలుడితో కూతురు సన్నిహితంగా ఉండగా.. తండ్రి కళ్లారా చూశాడు. తన కూతురిని అలా చూసిన.. ఆ తండ్రి కోపంతో ఊగిపోయాడు. అదే కోపంలో బాలుడిపై చేయి చేసుకున్నాడు. అక్కడితో ఆగకుండా.. ఆవేశంతో ఇంట్లో ఉన్న కత్తి తీసుకొని బాలుడి గొంతు కోశాడు. బాధితుడు హాహాకారాలు చేసుకుంటూ బయటకు పరుగెత్తటంతో.. బాలిక తండ్రి కూడా ఆ వెనుకే వెళ్లాడు.తండ్రి తనను అలాంటి పరిస్థితి లో చూడటంతో.. తన ముఖం ఎలా చూపెట్టుకోవా లన్న అవమానానికి గురైందో లేదా తనను కూడా ఏమైనా చేస్తారేమో

అని భయపడిందో.. తీవ్ర ఆందోళనకు గురైన బాలిక ఇంట్లో గడియ పెట్టుకొా ని ఉరేసుకుంది. ఇది గమనించిన తండ్రి.. స్థానికు ల సహాయంతో ఇంటి తలుపులు పగులగొట్టి చూడగా.. ఆ బాలిక అప్పటికే విగతజీవిగా మారి పోయింది. దీంతో.. ఆ తండ్రి గుండెలవిసేలా రోదించాడు. స్వల్పంగా గొంతు తెగిన ఆ బాలుడిని వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# వరంగల్‌లో మల్టీ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్..

ఆపరేషన్ థియేటర్లలో అన్ని అనగా ఆక్సిజన్, ఫైర్, ఏసీ, విద్యుత్తు, నీరు సరఫరాకు సంబంధించిన అనుసంధాన పనులు జరుగుతున్నాయి. అయితే.. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణ పనులపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి, ఎంజీఎం ఇంఛార్జి సూపరింటెండెంట్ డా. కిషోర్‌కుమార్ తెలిపారు.



తెలంగాణకు రెండో రాజధానిగా వరంగల్‌ను రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలోనే.. వరంగల్‌ను అన్ని రకాలు అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే పలు రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన ప్రభుత్వం.. ఇప్పుడు వైద్య రంగంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగానే.. గత ప్రభుత్వంలో మొదలుపెట్టిన మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను శరవేగంగా కొనసాగిస్తోంది. కాగా.. ఈ నెలాఖరులోగా ఆస్పత్రి నిర్మాణంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేసేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ అన్ని రకాలుగా కృషి చేస్తోంది. ఈ మేరకు.. అన్ని రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. రవాణా సౌకర్యాలపై ఫోకస్ పెట్టిన ప్రభుత్వం.. రైల్వేలైన్లు, రోడ్డు మార్గాల నిర్మాణంపై కసరత్తు చేస్తోంది. మరోవైపు.. మామునూరు ఎయిర్‌పోర్టు పనుల్లో వేగం పెంచింది. ఇక.. వరంగల్‌లో వైద్యరంగాన్ని కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే.. వరగంల్‌ను హెల్త్ సిటీగా మార్చాలన్న ఉద్దేశంతో.. నగరంలోని సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల్లో వేగం పెంచింది. గత ప్రభుత్వ హయంలో 2021 జూన్ 21న మొదలుపెట్టిన 24 అంతస్తుల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం శరవేగంగా సాగుతోంది. భవన నిర్మాణం ఇప్పటికే పూర్తవగా.. ప్రస్తుతం లోపల అత్యవసర సేవలు, 12 అంతస్తుల్లోని పకడలకు ఆక్సిజన్, ఫైర్, సెంట్రల్ ఏసీలైన్, విద్యుత్తు, నీటిపైప్‌లు, క్యాన్సర్ విభాగానికి రేడియేషన్ థెరపీ కోసం ప్రత్యేక బంకర్ల నిర్మాణం, ఆపరేషన్ థియేటర్ల నిర్మాణం అందులోని అన్ని అనగా ఆక్సిజన్, ఫైర్, ఏసీ, విద్యుత్తు, నీరు సరఫరాకు సంబంధించిన అనుసంధాన పనులు జరుగుతున్నాయి. అయితే.. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణ పనులపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి, ఎంజీఎం ఇంఛార్జి సూపరింటెండెంట్ డా. కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని 59 ఎకరాల్లో 24 అంతస్తుల్లో నిర్మిస్తుండగా.. 12 అంతస్తుల్లో 34 వైద్యవిభాగాల ఓపీ, ఐపీ సేవల కోసం వినియోగి ంచుకునేందుకు అనుగుణంగా నిర్మిస్తున్నారు. కాగా.. ఈ ఆస్పత్రిలో ఏకంగా.. 2208 పడకలు, 500 మంది డాక్టర్లు, 1000 మంది స్టాఫ్ నర్సులు, మరో 1000 మంది పారా మెడికల్ వైద్య సిబ్బంది సేవలందించేలా సదుపాయాలు కల్పిస్తున్నారు.

ఇక.. మిగిలిన అంతస్తుల్లో డాక్టర్ల సమావేశ మందిరం, పీజీ విద్యార్థుల తరగతి గదులు, గ్రంథాలయం, ల్యాబ్‌లు, ఇలా అన్నిరకాల సదుపాయాలు కల్పించనున్నారు. ఈ మేరకు.. అన్ని పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కాగా.. భవన నిర్మాణం, సర్వీసుల కోసం రూ.884 కోట్లు ఖర్చు చేస్తుండగా.. రూ.107 కోట్లతో వైద్యపరికరాలు కొనుగోలు చేస్తున్నారు. ఇక.. మిగతా పనులకు రూ.125 కోట్లు ఖర్చు పెట్టనున్నారు. మొత్తంగా.. రూ.1,116 కోట్లతో ఈ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. కాగా.. ఈ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే.. వరంగల్ జిల్లా ప్రజలకు వైద్యానికి ఎలాంటి లోటు లేకుండా ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.





# బుచ్చిబాబుకి మెగా ఫ్యాన్స్ థాంక్స్

రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్'పై మెగా ఫ్యాన్స్ ఎన్నో ఆశలుపెట్టుకున్నారు. అయితే ఈ సినిమాకి విమర్శకుల ప్రశంసలు దక్కినా.. నెగిటివిటీని మూటకట్టుకుంది. కావాలని కొంతమంది నెగిటివ్ ప్రచారం చేయగా.. కంటెంట్ పరంగానూ విమర్శలకు తావిచ్చేలా ఉండటంతో 'గేమ్ ఛేంజర్' సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. అయితే ఇప్పుడు మెగా ఫ్యాన్స్ ఆశలన్నీ రామ్ చరణ్ తదుపరి చిత్రంపైనే ఉన్నాయి. గేమ్ ఛేంజర్ తరువాత రామ్ చరణ్.. బుచ్చిబాబు దర్శకత్వంలో పనిచేస్తుండగా.. ఈ సినిమాకి సంబంధించి లేటెస్ట్ అప్డేట్ ఏంటంటే..

'ఆర్ఆర్ఆర్' సినిమాతో గ్లోబల్ స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న రామ్ చరణ్ ఇటీవల 'గేమ్ ఛేంజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించిన గేమ్ ఛేంజర్ సినిమా 2025 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి తీవ్రంగా నిరాశ పరిచింది. చరణ్ డ్యూయెల్ రోల్‌లో నటించిన ఆ సినిమా నిర్మాతకు భారీ నష్టాలు మిగిల్చిందనే వార్తలు వస్తున్నాయి. అయితే అప్పన్న పాత్రలో చరణ్ నటన బాగుందని విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. సినిమా ఫ్లాప్ అయినా రామ్ చరణ్ ట్రోల్స్‌కి మాత్రం గురి కాకపోవడం ఊరట కలిగించే విషయం. ప్రస్తుతం అందరి దృష్టి బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న ఆర్‌సీ16 సినిమాపై ఉంది.

మొదటి సినిమా 'ఉప్పెన'తో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న దర్శకుడు బుచ్చిబాబు రెండో సినిమాకే రామ్ చరణ్‌ని డైరెక్ట్ చేసే అవకాశం దక్కించుకున్నారు. సుకుమార్ శిష్యుడైన బుచ్చిబాబు గురువుకి తగ్గ శిష్యుడని మొదటి సినిమాతో ప్రశంసలు దక్కించుకున్నారు. అందుకే రామ్ చరణ్ వంటి స్టార్ ఆయనతో సినిమాను చేసేందుకు సిద్ధం అయ్యారు. రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న సినిమా గురించి, కథ గురించి ఎన్నో పుకార్లు షికార్లు చేశాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. పుకార్ల గురించి పట్టించుకోకుండా పూర్తిగా సినిమా మేకింగ్‌పైనే దర్శకుడు బుచ్చిబాబు దృష్టి పెట్టారు.

'గేమ్ ఛేంజర్' సినిమా ప్రమోషన్స్ కోసం గ్యాప్ తీసుకున్న రామ్ చరణ్ తిరిగి ఆర్‌సీ16 షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. సినిమా కొత్త షెడ్యూల్‌ను దర్శకుడు మొదలు పెట్టారు. గేమ్ ఛేంజర్ ఫ్లాప్‌తో నిరాశలో ఉన్న మెగా ఫ్యాన్స్ కోసం ఈ ఏడాదిలోనే చరణ్ సినిమాను తీసుకు వస్తే బాగుంటుందని అంతా భావిస్తున్నారు. మెగా కాంపౌండ్‌లోనూ అదే అభిప్రాయం ఉంది. సినిమాను ఇదే ఏడాదిలో విడుదల చేయడం ద్వారా గేమ్ ఛేంజర్ డ్యామేజ్‌ని తగ్గించాలని భావిస్తున్నారు. అందుకే బుచ్చిబాబుకి ఈ ఏడాదిలోనే సినిమా విడుదల చేసే విధంగా షూటింగ్ ముగించాలని మెగా కాంపౌండ్ నుంచి రిక్వెస్ట్ వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.


అందుకు తగ్గట్లుగానే సినిమాను స్పీడ్‌గా ముగించాలని బుచ్చిబాబు షూటింగ్ చేస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్‌కి దాదాపు ఏడాది సమయం తీసుకున్న బుచ్చిబాబు సినిమా షూటింగ్‌ను ఏడాది లోపే ముగించే విధంగా స్పీడ్‌గా దూసుకు పోతున్నారు. ఆగస్టు వరకు సినిమా షూటింగ్ పూర్తి చేసి దసరా లేదా దీపావళి కానుకగా సినిమాను విడుదల చేయాలని భావిస్తున్నారు. ఇదే ఏడాదిలో సినిమాని విడుదల చేస్తే కచ్చితంగా మెగా ఫ్యాన్స్ బుచ్చిబాబుకు థాంక్స్ చెప్పడం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

తాజాగా ప్రారంభం అయిన షెడ్యూల్‌లో రామ్ చరణ్ జాయిన్ అయ్యారు. ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు షూట్ చేయబోతున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటించనున్న విషయం తెల్సిందే. రంగస్థలం చిట్టిబాబు తరహాలో సినిమాలో చరణ్ లుక్ ఉంటుందనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

# అన్నయ్య కోసం వెనక్కి తగ్గుతాడా?



మాస్ మహారాజా రవితేజ సోలోగా హిట్టు కొట్టి రెండేళ్లు దాటిపోయింది. 'ధమాకా' తర్వాత ఆయన్నుంచి వచ్చిన ఏ సినిమా కూడా బాక్సాఫీస్ దగ్గర ఆశించిన సక్సెస్ సాధించలేదు. 'వాల్తేరు వీరయ్య' హిట్టైంది కానీ, అది చిరంజీవి ఖాతాలోకి వెళ్ళిపోయింది. ఇక 'రావణాసుర', 'టైగర్ నాగేశ్వరరావు', 'ఈగల్', 'మిస్టర్ బచ్చన్' లాంటి బ్యాక్ టూ బ్యాక్ నాలుగు సినిమాలు డిజాస్టర్లుగా మారాయి. అందుకే ఈసారి 'మాస్ జాతర' మూవీతో తప్పకుండా హిట్టు కొట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇప్పుడు రవితేజ డేట్ మీద మెగాస్టార్ కన్నేసినట్లుగా టాక్ వినిపిస్తోంది. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో రవితేజ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మాస్ జాతర'. తనకు కలిసొచ్చిన పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు. ఈ సినిమాతో భోగవరపు భాను అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నాడు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్ లుక్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. రీసెంట్ గా రవితేజ బర్త్ డే స్పెషల్ గా వచ్చిన మాస్ ర్యాంపేజ్ గ్లింప్స్ కూడా మాస్ రాజా ఫ్యాన్స్ కి విపరీతంగా నచ్చేసింది. మే 9వ తేదీ కోసం అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే అదే రోజున సినిమా థియేటర్లలో విడుదల చేస్తామని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. కానీ అదే డేట్ కి 'విశ్వంభర' సినిమాని తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.



చిరంజీవి హీరోగా వశిష్ఠ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ముందుగా ఈ చిత్రాన్ని సంక్రాంతికి రిలీజ్ చేయాలని అనుకున్నారు. కానీ చివరి నిమిషంలో 'గేమ్ ఛేంజర్' కోసం వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత కొత్త విడుదల తేదీని ప్రకటించలేదు. సమ్మర్ సీజన్ లో మంచి డేట్స్ అన్నీ లాక్ అయిపోవడంతో, వీటి మధ్యలో మెగా మూవీని ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారని ఫ్యాన్స్ అంతా ఆతృతగా వేచి చూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం మే 9వ తారీఖున విడుదల చేయడానికే మెగాస్టార్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.
మే 9వ తేదీకి టాలీవుడ్ లో మంచి హిస్టరీ ఉంది. 'ప్రేమించుకుందాం రా' 'మహానటి' 'మహర్షి' లాంటి సక్సెస్ ఫుల్ మూవీస్ ఆ డేట్ కే వచ్చాయి. పాతికేళ్ల క్రితం చిరు నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమా కూడా అదే రోజున రిలీజై సంచలన విజయం సాధించింది. యాదృచ్ఛికంగా ఇప్పుడు 'విశ్వంభర' చిత్రాన్ని ఆ తేదీకే విడుదల చేస్తారని అంటున్నారు. ఇప్పటికే ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ టాకీ పార్ట్ దాదాపుగా కంప్లీట్ అయిపోయింది. శివరాత్రికి విడుదల తేదీని అనౌన్స్ చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ నిజంగానే చిరు మే 9కే రావాలని ఫిక్స్ అయితే, అన్నయ్య కోసం రవితేజ వెనక్కి తగ్గుతాడా? 'మాస్ జాతర'ను వాయిదా వేసుకుంటారా? లేదా ఇద్దరూ బాక్సాఫీర్ బరిలో దిగుతారా? అనేది ఆసక్తికరంగా మారింది.



నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా నటించిన 'తండేల్' సినిమా అంచనాలు పెంచుతూ ట్రైలర్ విడుదలైంది. తాజాగా వైజాగ్‌లో జరిగిన 'తండేల్' సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా చైతూ మాట్లాడుతూ తాను వైజాగ్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాను, తన ఇంట్లో రూలింగ్ పార్టీ వైజాగ్ అంటూ కలెక్షన్ల గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'తండేల్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వైజాగ్‌లో భారీ ఎత్తున నిర్వహించారు. హీరో నాగ చైతన్య, నిర్మాత అల్లు అరవింద్, దర్శకుడు చందు మొండేటితో పాటు చిత్ర యూనిట్ సభ్యులు, సినీ ప్రముఖులు పలువురు పాల్గొన్నారు. నాగ చైతన్య మొదటి సారి మత్స్యకారుడిగా కనిపించబోతున్నారు. నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ సినిమాలో నాగ చైతన్యకు జోడీగా సాయిపల్లవి నటించడం ప్రధాన ఆకర్షణగా చెప్పుకోవచ్చు. సాయి పల్లవికి టాలీవుడ్‌లో ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాలో ఆమె నటనతో సినిమా స్థాయిని మరింతగా పెంచిందని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఈ

# నా పరువు నిలబెట్టండి...

సినిమా ట్రైలర్ లాంచ్‌లో ఆమె పాల్గొనాల్సి ఉన్నా తీవ్రమైన జ్వరం కారణంగా ఆ డాక్టర్లు ప్రయాణాలు చేయవద్దని సూచించారట. అందుకే ఆమె రాలేక పోయిందని అల్లు అరవింద్ చెప్పుకొచ్చారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నాగ చైతన్య మాట్లాడుతూ సినిమా కోసం చాలా కష్టపడ్డామని చెప్పుకొచ్చారు. ప్రతి ఒక్కరికి నచ్చే విధంగా తండేల్ ఉంటుందని అన్నారు. రాజు పాత్ర ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుందని నమ్మకం వ్యక్తం చేశారు. వైజాగ్ అమ్మాయి శోభితని ప్రేమించి పెళ్లి చేసుకున్నాను. వైజాగ్ లో తన సినిమాకి వసూళ్లు ఎక్కువ రాకుంటే ఇంట్లో పరువు పోతుందని సరదాగా ఫ్యాన్స్‌ని ఉద్దేశించి అన్నారు. తన పరువు నిలపాలంటే వైజాగ్‌లో తండేల్ సినిమాకు అత్యధిక వసూళ్లు ఇవ్వాలంటూ ఫ్యాన్స్‌కి నాగ చైతన్య రిక్వెస్ట్ చేశారు. నాగ చైతన్య మాటలకు అంతా గట్టిగా నవ్వారు. అంతే కాకుండా చైతూ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల నాగ చైతన్య, శోభితల వివాహం వైభవంగా జరిగింది. పెళ్లి తర్వాత నాగ చైతన్య నుంచి రాబోతున్న మొదటి సినిమా కావడంతో 'తండేల్' చాలా స్పెషల్ మూవీగా అంతా భావిస్తున్నారు. ఫిబ్రవరి 7న రాబోతున్న ఈ సినిమా ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.



# బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సైఫ్ అలీఖాన్ కొడుకు..

సోషల్ మీడియా వేదికగా ఆయన పోస్ట్ పెడుతూ.. ఇబ్రహీంని బాలీవుడ్‌కి పరిచయం చేయబోతున్నాను అంటూ ప్రకటించాడు. ఈ సందర్భంగా ఇన్‌స్టాలో ఒక పోస్ట్ పెట్టాడు.

12 ఏండ్ల క్రితం ఇబ్రహీం అలీఖాన్ తల్లి అమృత (సైఫ్ అలీఖాన్ మొదటి భార్య)ని మొదటి సారి నేను కలిశాను. తనను డింగి అని పిలవడం నాకు అలవాటు. అమృత మా నాన్నతో కలిసి ధర్మ ప్రొడక్షన్స్‌లో 'దునియా' అనే సినిమా చేసింది. ఈ సినిమా తర్వాత మేమిద్దరం మంచి ఫ్రెండ్స్ అయ్యాం. తనతో కలిసి చైనీస్ డిన్నర్ చేయడం.. జేమ్స్ బాండ్ సినిమా చూడడం.. ఇప్పటికి మర్చిపోలేను. మేము కలిసిన సెకండ్ టైంలోనే నన్ను స్వంత మనిషిలా చూసుకుంది. సైఫ్‌ని నేను మొదటిసారి ఆనంద్ మహింద్రా ఆఫీస్‌లో కలిశాను. ఆ తర్వాత ఈ ఫ్యామిలీతో మంచి రిలేషన్ ఏర్పడింది. సినిమా అనేది వీరి రక్తంలోనే ఉంది. త్వరలోనే మీ ముందుకు ఇబ్రహీం అలీఖాన్‌ని పరిచయం చేయబోతున్నాను. అప్పటివరకు వెయిట్ చేయండి అంటూ కరణ్ జోహార్ రాసుకొచ్చాడు. నటి శ్రీలీలతో కలిసి ఇబ్రహీం అలీఖాన్ రెస్టారెంట్‌లో నుంచి బయటికి వచ్చిన ఫోటోలు ఇటీవలే వైరల్ అయిన విషయం తెలిసిందే. తాజాగా ఇబ్రహీం డెబ్యూ మూవీలో హీరోయిన్‌గా శ్రీలీల నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# మ్యాజిక్ వర్కవుట్ అవుతుందా..?

కుర్రకారులో ఈ పేరుకు ఉన్న క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన 'ఫిదా' చిత్రంతో నాయికగా పరిచయమైన ఈ అందాల తార తొలిచిత్రంతోనే యువ ప్రేక్షకులను ఆకట్టుకుంది. భానుమతి ఒక్కటే పీస్, హైబ్రీడ్ పిల్ల అంటూ తొలిచిత్రంలో సందడి చేసిన సాయి పల్లవి.. మొదటి సినిమాతోనే వచ్చిన క్రేజ్‌ను ఎప్పుడూ క్యాష్ చేసుకోవాలనుకోలేదు. సినిమాల విషయంలో చాలా సెలెక్టివ్‌గా తన మనసుకు నచ్చిన కథలనే చేసుకుంటూ వెళుతుంది. అందుకే ఈ కథానాయికకు తెలుగు నాట కూడా ఇంత క్రేజ్, నానితో నటించిన ఏమ్‌సీఏ, ఇటీవల వచ్చిన 'అమరన్' చిత్ర విజయాల్లో సాయి పల్లవి మ్యాజిక్ వర్కవుట్ అయ్యిందనే చెప్పాలి. ముఖ్యంగా 'అమరన్' చిత్రానికి ఎటువంటి పబ్లిసిటి లేకపోయినా, కేవలం సాయి పల్లవి క్రేజ్‌తోనే ఆ చిత్రం తమిళంలో కంటే తెలుగులోనే ఎక్కువ వసూళ్లను సాధించింది. ఇక తాజాగా ఈ క్రేజీ నాయిక నటిస్తున్న చిత్రం 'తండేల్'. నాగచైతన్య నటిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 7న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి ఈ రోజు బజ్ రావడానికి సాయి పల్లవి కూడా ఓ ముఖ్య కారణం.ఆమెకున్న క్రేజ్ ఖచ్చితంగా ఈ చిత్రం మంచి ప్రారంభ వసూళ్లు సాధించ ానికి ఉపయోగపడుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు.



# వైజాగ్ రోడ్లపై రావు రమేశ్, సందీప్ కిషన్..





ఇంప్రెసివ్‌గా మజాకా బ్యాచిలర్స్ ఆంథెమ్ సాంగ్ సందీప్ కిషన్ ప్రస్తుతం ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో మజాకా చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళంలో మంచి ఫాలోయింగ్ ఉన్న యాక్టర్ సందీప్ కిషన్. ప్రస్తుతం ధమాకా ఫేం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో మజాకా చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, మన్మథుడు ఫేం అన్షు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల చేసిన మజాకా టైటిల్, ఫస్ట్ లుక్‌లో సందీప్ కిషన్ పంచె కట్టులో కనిపిస్తూ సందడి చేస్తున్నాడు.

తాజాగా ఈ మూవీ నుంచి బ్యాచిలర్స్ ఆంథెమ్‌ను విడుదల చేశారు. వైజాగ్ ఆర్కే బీచ్ వెంబడి సందీప్ కిషన్, రావు రమేశ్ అండ్ గ్యాంగ్ పాడుకుంటున్న ఈ పాట యూత్‌ను ఆకట్టుకునే సాగుతూ ఇంప్రెస్ చేస్తోంది. సరస్వతి పుత్ర రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను లియోన్ జేమ్స్ కంపోజిషన్‌లో ధనుంజయ్ సీపాన పాడాడు.

ఆర్కే బీచ్‌లో మందుకొడుతున్న ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చాం సార్.. హీరోహీరోయిన్లు స్టేషన్‌లో ఉన్న సీన్లతో మొదలైన టీజర్.. సినిమా ఫన్ ఎలిమెంట్స్‌తో సాగనున్నట్టు క్లారిటీ ఇచ్చేసింది. అక్కడ పోసుకున్నది బీరు కాదండి.. నా ఉసురు అని సందీప్ కిషన్ అంటుంటే.. నాకు తెలియక అడుగుతున్నాను బీర్ బెటరా.. విస్కీ బెటరా అని అడుగుతోంది రీతూవర్మ. దీనికి రకుల్ బెటరా.. రెజీనా బెటరా అంటే ఏం చెప్తానండీ రీతూ వర్మ డైలాగ్స్ సరికొత్తగా సాగుతున్నాయి. మాస్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న మజాకా ఫిబ్రవరి 21న విడుదల కానుంది. ఈ మూవీని ఏకే ఎంటర్‌టైన్ మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.